క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దాత చిన్నాథర్

పరవాడ: మండలంలోని పి.బోనంగిలో షిర్డీ సాయిబాబా ఆలయ నిర్మాణానికి కైలాసపురానికి చెందిన గండి చిన్నాథర్ శ్యామల దంపతులు రూ.లక్ష విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.నాగేశ్వరరావు, జె.శ్రీను, గుండు లోకేష్, పైల శ్రీనివాసరావు, బండారు గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు అభినందన



ఎన్‌సీసీ పరీక్షలో ఉత్తీర్ణులైన సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ విభాగంలో బి సర్టిఫికెట్ పరీక్షకు హాజరై ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి అభినందించారు. కళాశాల నుంచి తృతీయ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న 29 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరు కాగా అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను మిగిలిన అధ్యాపకులతో కలిసి ఆమె అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెందుర్తి: మండలంలోని ఈపీడీసీఎల్ 11కేవీ గొరపల్లి ఫీడర్, రాంపురం సబ్ స్టేషన్ల పరిధిలోని విద్యుత్ లైన్ల నిర్వహణ,మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని జోన్-3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ఈ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు. గంగమ్మపేట,గొరపల్లి, గవరపాలెం,వెల్ఫేర్ కాలేజ్,కోట్నివానిపాలెం ,సంతపాలెం,గొల్లపాలెం తదితర ప్రాంతాలకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కనకంబరాల అలంకరణలో బాలాజీ



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలోని తిరుమల బాలాజీను కనకంబరాలతో విశేష అలంకరించారు. గురువారం స్వామి వారి జన్మనక్షత్రం శ్రవణా నక్షత్రం సందర్భంగా దివ్యక్షేత్రంలో సాయంత్రం స్వామివారికి శ్రీదేవి, భూదేవి సహిత శాంతి కళ్యాణం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి విశేషంగా భక్తులు పాల్గొని కళ్యాణం వీక్షించారు. శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి.

కిరండూల్ పాసింజర్‌కు థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్

తాటిచెట్లపాలెం : వేసవి వేళ ప్రయాణికుల సౌకర్యార్థం ఈస్ట్ కోస్ట్ రైల్వే, వాల్తేర్ డివిజన్ పరిధిలో నడుస్తున్న విశాఖపట్నం – కిరండూల్ (08551 /08552) పాసింజర్ స్పెషల్ రైలుకు ఒక థర్డ్ ఏసీ ఎకానమీ కోచ్ జత చేస్తున్నట్లు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. ఏప్రిల్ 8 నుంచి జూలై 1 వరకు థర్డ్ ఏసీ ఎకానమి కోచ్ జత చేస్తున్నామని, ఈ సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు.

• వాల్తేర్ డివిజన్, కేకే లైన్ పరిధి బొర్రా గుహలు – కరకవలస స్టేషన్ల మధ్య బ్రిడ్జి పునర్నిర్మాణ పనులు చేపడుతున్నందున ఏప్రిల్ 10న విశాఖపట్నం – కిరండూల్ (08551), కిరండూల్ – విశాఖపట్నం(085520 పాసింజర్ రైళ్లు ఇరువైపులా రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.

మాకెందుకీ అవస్థ?

- మండిపడుతున్న పింఛనర్లు
- సాయంతో సచివాలయాలకు..

టీడీపీ అధినేత చంద్రబాబు.. ఆయన తొత్తులపై పింఛనర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయం కోసం ఇళ్లల్లో హాయిగా ఉన్న మమ్మల్ని ఇలా ఎండలో తిప్పడం న్యాయమేనా అని ప్రశ్నిస్తున్నారు. మాకు ఏ కష్టం తెలియకుండా వలంటీర్లు తెల్లవారే సరికి వచ్చి పింఛన్ ఇచ్చి పోయేవారు... ఇప్పుడు చంద్రబాబు తన వాళ్లతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం వల్ల వలంటీర్లతో పింఛన్ పంపిణీ ఆపేశారంటున్నారు.. నడవ లేని.. ఆసరా కోసం ఎదురు చూస్తున్న మమ్మల్ని ఇలా అవస్థలకు గురి చేయడం మంచిది కాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



నాయుడుపాలెం సచివాలయంలో పింఛన్ కోసం వచ్చిన వృద్ధులు

పరవాడ: వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ ఇక్కట్లు కొనసాగుతున్నాయి. ఈ నెల పింఛన్ల పంపిణీ సచివాలయాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. నిజానికి ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించేవారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కల్పించిన ఆటంకం వల్ల వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయవద్దని ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. దీంతో సచివాలయాల్లో సిబ్బంది పింఛన్లు అందజేస్తున్నారు. ఇంటి వద్ద తీసుకునే వృద్ధులు నానా కష్టాలు పడుతూ సచివాలయాలకు ఎండలో వెళుతున్నారు. అతి కష్టం మీద పింఛను తీసుకొని ఇంటిముఖం పడుతున్నారు. గురువారం ఎక్కువ మంది వృద్ధులు పింఛన్లు తీసుకొన్నారు. ఇంటి నుంచి కొందరు ఒంటరిగా రాలేక కుటుంబ సభ్యులను తోడు తీసుకువెళ్లారు. నడవలేని మరికొందరు ఆటోల మీద సచివాలయానికి చేరుకొని పింఛన్లు తీసుకున్నారు.

మా ఉసురు తగులుతుంది



ప్రతీ నెలా వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. చంద్రబాబు వల్ల మేం మళ్లీ సచివాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. జగనన్న పాలనలో ఇటువంటి ఇబ్బందులు ఉండేవి కావు. ఎన్నికలు రాగానే మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. చంద్రబాబు స్వార్థం కారణంగా మేం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నాం. వృద్ధాప్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్ కోసం పడిగాపులు కాస్తున్నాం. మళ్లీ. జగన్‌బాబు ముఖ్యమంత్రి అయితే మాకు ఈ కష్టాలు ఉండవు.

– కూండ్రపు ఎర్రయ్యమ్మ, వాడచీపురుపల్లి

నడవలేక నీరసం వస్తుంది



నేను పెదముషిడివాడలో ఉంటున్నాను. వలంటీరు రాకపోవడంతో పింఛన్ కోసం అష్టకష్టాలు పడి సచివాలయానికి వచ్చాను. గతంలో వలంటీరు తెల్లవారు జామున వచ్చి పింఛన్ ఇచ్చేది. వృద్ధాప్యం వల్ల నడుం వంగిపోయింది. తప్పని పరిస్థితిలో పడుతూ లేస్తూ కార్యాలయానికి వచ్చాను. వలంటీర్ ద్వారా మాకు ఇంటి వద్దే పింఛన్ ఇప్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నూకాలమ్మ, పెదముషిడివాడ

ఎల్లలు తెలియని వారు ఏం అభివృద్ధి చేస్తారు



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు

- అనకాపల్లి ప్రజలు డబ్బు సంచులకు లొంగరు
- వచ్చిన చోటకే సీఎం రమేష్‌ను పార్శిల్ చేస్తాం
- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

సబ్బవరం: అనకాపల్లి జిల్లాకు ఎల్లలు తెలియని వారు ఏం అభివృద్ధి చేస్తారని కూటమి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్‌ను ఉద్దేశించి డిప్యూటీ సీఎం, అనకాపల్లి వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు ధ్వజమెత్తారు. సబ్బవరంలోని జీవీఎస్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అధ్యక్షతన సబ్బవరం,పరవాడ మండలాల వైఎస్సార్‌పార్టీ శ్రేణులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ స్థానిక కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులకు పెట్టుబడిదారుడిగా ఉండేందుకే సీఎం రమేష్‌ను ఇక్కడికి దిగుమతి చేశారన్నారు. ఈ ప్రాంత సమస్యలు సీఎం రమేష్‌కు ఏం తెలుసు..,కనీసం ఒక్కరినైనా పేరు పెట్టి పిలవగలిగే అవకాశం ఉందా అని ప్రశ్నించారు. ఎక్కడి నుంచి వచ్చాడో అక్కడికే సీఎం రమేష్‌ను అనకాపల్లి ప్రజలంతా కలిసి పార్శిల్ చేస్తామన్నారు.

దొంగల ముఠాకు ఐక్యంగా గుణపాఠం చెబుదాం

వైఎస్సార్‌సీపీలోని ప్రతి కార్యకర్త క్రియాశీలకంగా పని చేయాలని బూడి పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ,ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి పాటు పడాలని సూచించారు.నాయకుడికి,కార్యకర్తకు మధ్య స్థిరమైన బంధం ఏర్పాటు చేసుకోవాలని అందుకోసం నిరంతరం వ్యక్తిగతంగా, ఫోన్లలో అందుబాటులో ఉండాలన్నారు. డబ్బుతో రాజకీయం చేయడానికి వచ్చిన దోపిడీ దొంగల ముఠాకు జిల్లా ప్రజలు చక్కని గుణపాఠం చెప్పాలని కోరారు.

అభివృద్ధిని అడ్డుకోవడమే వారి పని

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలకు అడ్డుపడడం తప్పా కూటమి నాయకులు చేసింది ఏమీ లేదని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ విమర్శించారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడు బూడి ముత్యాలనాయుడుని ఎంపీ అభ్యర్థిగా ప్రకటించడంతో పెందుర్తి నియోజకవర్గంలో నూతన ఉత్తేజం వచ్చిందన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చగలిగాం కాబట్టే ధీమాగా గ్రామాల్లోకి వెల్లగలుగుతున్నామన్నారు. ఆ ధైర్యం ప్రతిపక్షాల నాయకులకు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. స్థానికుడిని కాబట్టే భయం, బాధ్యతతో ప్రజాసేవ చేస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి, సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పరవాడ మండలాల జెడ్పీటీసీ పైల శ్రీనివాసరావు, జేసీఎస్ ఇన్‌చార్జిలు, ఎంపీటీసీలు,సర్పంచ్‌లు,నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచార కరపత్రాలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్,పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరిస్తున్న బూడి ముత్యాలనాయుడు



సమావేశానికి హాజరైన నాయకులు, పార్టీ శ్రేణులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



యజ్ఞోపవీతం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణసంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్య కల్యాణం : వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

సూర్యనారాయణమ్మ మృతికి సంతాపం

భౌతిక కాయానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే



సూర్యనారాయణమ్మ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, నాయకులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు మాతృమూర్తి, రావాడ మాజీ సర్పంచ్ కోన సూర్యనారాయణమ్మ అనారోగ్యంతో బుధవారం రాత్రి మరణించారు. సూర్యనారాయణమ్మ పార్థివ దేహానికి గురువారం ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నివాళులర్పించారు. ఆయన వెంట రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, వైస్ ఎంపీపీ బి.నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ కావలి రాజు, నాయకులు కావలి వాసు, పల్లా గోవిందు, దాసరి వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మనుగడ



మాట్లాడుతున్న ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ ఖగేశ్వరరావు



పాల్గొన్న విద్యార్థులు

పరవాడ: పర్యావరణాన్ని కాపాడకపోతే మానవాళి మనుగడ ప్రశ్నార్థకం అవుతుందని వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పందిరి కనకేశ్వరరావు అన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆంధ్రప్రదేశ్ సంచాలకురాలు పి.స్రవంతి, అనకాపల్లి జిల్లా విద్యాశాఖాధికారి వెంకటలక్ష్మమ్మ ఆదేశాల మేరకు మండలంలోని వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎకో క్లబ్‌ల ద్వారా పాఠశాల స్థాయి విద్యార్థులకు పచ్చదనం, పర్యావరణంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. ముత్యాలమ్మపాలెం ఇన్‌చార్జి హెచ్ఎం సత్యదేవ్ మాట్లాడుతూ పర్యావరణ హితం కోసం రానున్న రోజుల్లో సోలార్ విద్యుత్ వాడకం తప్పని సరి అన్నారు. ఏపీఎన్‌జీసీ అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్ ఖగేశ్వరరావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతపై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకుని వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కాలుష్యానికి కారణమైన ప్లాస్టిక్ వినియోగం నిషేధించాలన్నారు. మొక్కలు నాటడం వంటి కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొవాలన్నారు. క్లస్టర్ కోఆర్డినేటర్ బుడుమూరు అన్నాజీరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.రమేష్ బాబు, శ్యామ్‌సుందర్, సౌజన్య, అరుణజ్యోతి, ఇందిర, వరలక్ష్మి, పాత్రుడు, సన్యాసినాయుడు, అప్పలరాజు, విద్యార్థి నందూరి గీతాశ్రీ మాట్లాడారు. ముందుగా పర్యావరణ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

15 నుంచి ఓపెన్ డిగ్రీ విద్యార్థులకు ప్రాక్టికల్స్

మద్దిలపాలెం : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2021–22 విద్యా సంవత్సరం ప్రవేశం పొందిన విద్యార్థులకు ఈ నెల 15 నుంచి ప్రాక్టికల్ పరీక్షలతో పాటు, నాలుగో సెమిస్టర్ తరగతులు నిర్వహించనున్నామని అధ్యయన కేంద్ర కోఆర్డినేటర్ జి.రాజుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టైమ్ టేబుల్‌ను పోస్టల్ చిరునామాలకు పంపించామని పేర్కొన్నారు. విధిగా విద్యార్థులు హాజరు కావాలని ఆయన సూచించారు.

ఉక్కు ఉద్యోగులకు వెంటనే వేతనాలు చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు వెంటనే వేతనాలు చెల్లించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం సీఎండీ అతుల్ భట్‌కు లేఖ అందించారు. ఉక్కు అధికారులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులకు యాజమాన్యం సకాలంలో జీతాల చెల్లించకపోవటం ఆందోళన కలిగిస్తున్నదన్నారు. యాజమాన్యం ఉద్దేశపూర్వకంగా చేస్తున్న చర్యలను ఖండిస్తున్నామన్నారు.

ముత్యాలమ్మా.. చల్లగ చూడమ్మా



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న చొక్కాకుల వెంకటరావు తదితరులు

- ఘనంగా మారువారం పండగ
- పోటెత్తిన భక్తులు

సబ్బవరం: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న అంతకాపల్లిలో కొలువైన ముత్యాలమ్మ మారువారం పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు వేకువ జాము నుంచి అమ్మవారిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల దర్శనానికి అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పసుపు– కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో బారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కోలాటం పోటీలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి,వీకేపీసీపీఐఆర్ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి,వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు



కోలాటం ఆడుతున్న మహిళలు

వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం



అడవివరంలోని పాత గోశాల లేఅవుట్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అడవివరంలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి ఝాన్సీని, భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావును గెలిపించాలని కోరారు. గడిచిన ఐదేళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయితేనే మరింత సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కరపత్రాలు అందజేశారు. 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు, ఇన్‌చార్జి ఎర్ర వరహానరసింహం, వైఎస్సార్‌సీపీ నాయకులు రాంభక్త ప్రసాద్ , కర్రి అప్పలస్వామి, లంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో నాయకత్వ లక్షణాలు



సదస్సులో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ ఎం.జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్: సేవకుడే నాయకుడని, అటువంటి నాయకులను తయారు చేయడమే జాతీయ సేవా పథకం లక్ష్యమని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సమావేశ మందిరంలో రాజీవ్ గాంధీ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ పాలసీ(శ్రీ పెరంబదూర్), ఏయూ జాతీయ సేవా పథకం సంయుక్తంగా విశాఖ జిల్లా ప్రోగ్రాం అధికారులకు ×యువజన హక్కులు న్యాయ సహాయం×అంశంపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. సేవా కార్యక్రమాల నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. గౌరవ అతిథిగా డీఎస్ఎన్ఎల్‌యూ పూర్వ ఉపకులపతి ఆచార్య వై.సత్యనారాయణ మాట్లాడుతూ యువత ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్నారు. ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ హక్కులు–విధులకు విడదీయరాని సంబంధం కలిగి ఉందన్నారు. హక్కుల కోసం పోరాడే వారు విధులను నిర్వహించాలని సూచించారు. అనంతరం యువజన విధానం డ్రాఫ్ట్ 2023 అంశంపై ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎస్.హరనాథ్, సమాచార హక్కు చట్టం–యువత పాత్రపై డాక్టర్ కె.పల్లవి కీలకోపన్యాసాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి, జిల్లాలోని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

7న జూలో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ఆరిలోవ: నేషనల్ జూ లవర్స్ డేని ఈ నెల 8న జూలో నిర్వహించనున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 7న మూడు నుంచి 12 సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జూలో ఉన్న జంతువులు థీమ్ ప్రకారం చిన్నారులు డ్రెస్‌లు వేసుకొని పోటీలో పాల్గొనాలన్నారు. చిన్నారుల వేషం జంతువులకు సంబంధించిన సమాచారం ఇచ్చేదిగా ఉండాలన్నారు. ఈ నెల 7న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న చిన్నారులు మరిన్ని వివరాల కోసం 94411 30894 నంబరులో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

గెస్ట్‌హౌస్ ప్రైవేటు చేతుల్లోకి వెళితే దేశ భద్రతకు ప్రమాదం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ గెస్ట్‌హౌస్‌లు ప్రైవేటు చేతుల్లోకి వెళితే దేశ భద్రతకు ప్రమాదమని స్టీల్ సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ఆస్తులు ఒక్కొక్కటి ప్రైవేటు చేతుల్లోకి మారుస్తున్న క్రమంలో ఉక్కు హౌస్, గంగవరం గెస్ట్‌హౌస్‌లు 30 ఏళ్ల పాటు లీజుకు ఇవ్వడానికి యాజమాన్యం టెండర్లు పిలవడాన్ని సీఐటీయూ నాయకులు వ్యతిరేకించారు. ఈ సందర్భంగా గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగవరం గెస్ట్‌హౌస్ నుంచి తూర్పు నౌకాదళం ప్రధాన స్థావరం పూర్తిగా కనిపిస్తుందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆ గెస్ట్‌హౌస్ ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇవ్వడం ఏ మాత్రం సమర్థణీయం కాదన్నారు. పాతిక వేల కోట్ల పరిశ్రమను 50 వేల కోట్లకు తీసుకువెళ్లాల్సిన ఉక్కు మంత్రిత్వశాఖ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యాలు కేవలం రెండు కోట్ల కోసం గెస్ట్‌హౌస్‌లు ప్రైవేటువారికి ఇవ్వడాన్ని ఆయన ఎద్దేవా చేశారు. యాజమాన్యం లీజు ప్రతిపాదన విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి, అధ్యక్షుడు వై.టి. దాస్ తదితరులు పాల్గొన్నారు.